

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలి

- ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపి నివారించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ విషయంలో ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం వికారాబాద్ జిల్లా పట్టణ కేంద్రంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గంజాయితోపాటు ఇతర మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మాదక ద్రవ్యాలు ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయో పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు ఉమ్మడిగా నిఘా పెట్టాలని సూచించారు. అవసరం అనుకుంటే ఇతర రాష్ట్రాల సహకారం కూడా తీసుకోవాలన్నారు. దొరికిన వారిపై కేసులు పెట్టి చేతులు దులుపుకోవడం కాదని.. వారికి ఉన్న లింకును కనిపెట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారులు నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా చెరువు కట్టల కింద, గుట్టలపైన, కాలువల పక్కన ఈత, తాటి, ఖర్జూర వంటి మొక్కలను పెంచాలన్నారు. ప్రతి గ్రామంలోనూ కనీసం 5 ఎకరాల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో చెట్లను పెంచాలని, ఆ చెట్ల నుంచి గీసిన కల్లును నగరానికి సరఫరా చేయాలని అన్నారు. ఈత నీరా, తాటి నీరా, ఖర్జూర నీరాలను ప్రోత్సహించాలని, కల్లును ఎగుమతి చేసే విధంగా కృషి చేయాలని వివరించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రితో చర్చించి మరిన్ని నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురవ్వడం, మృతిచెందడం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కల్తీ కల్లు మూలంగా కూలి చేసుకుని పొట్ట నింపుకుంటున్న పేదలు బలి కాకూడదన్నారు. కల్తీ కల్లును విక్రయిస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. గౌడన్నల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ప్రభుత్వ భూముల్లో ఈత, తాటి వనాలను పెంచాలని యోచిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా తాటి, ఈత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ్, సూపరింటెండెంట్ విజయ భాస్కర్, అదనపు కలెక్టర్ ఎం.సుధీర్ పాల్గొన్నారు.

అమెరికా టారీఫ్‌లపై భారత్ వైఖరేంటీ?

- మోడీ ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి
- ప్రత్యామ్నాయ సచివాలయాలుగా రాజ్‌భవన్‌లు
- బీహార్‌లో ఓట్ల తొలగింపు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు
- ప్రజాసమస్యలపై ఐక్య ఉద్యమాలు నిర్మిస్తాం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ విజయరాఘవన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎ విజయరాఘవన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికా విధిస్తున్న టారిఫ్‌లపై భారత ప్రభుత్వ వైఖరేంటో చెప్పాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ విజయరాఘవన్ చెప్పారు. మోడీ ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం, రెండురోజులపాటు జరగనున్న రాష్ట్ర కమిటీ సమావేశాలు శనివారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో విజయ రాఘవన్ మాట్లాడుతూ బ్రిక్స్ సమావేశం తర్వాత భారత్‌పై అమెరికా సుంకాలను మరింత పెంచిందని చెప్పారు. టారిఫ్‌లను పెంచడంతో ఎంఎస్ఎంఇలపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. వ్యవసాయ వస్తువులపైనా సుంకాలను విధిస్తోందని, రైతులపై భారం పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. అమెరికా విధిస్తున్న టారిఫ్‌లపై భారత ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అమెరికాకు అనుకూలంగా ట్రంప్ టారిఫ్‌లను పెంచారని అన్నారు. భారత ప్రజల మనోభావాలకు అనుగుణంగా మోడీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. భారత ప్రజలు, పారిశ్రామికవేత్తలు నష్టపోకుండా ఉండేలా వారికి భరోసా కల్పించేలా కేంద్రం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అమెరికా విధిస్తున్న టారిఫ్‌లను వ్యతిరేకంచాలని సూచించారు. అమెరికా టారిఫ్‌లపై చైనా స్పష్టమైన విధానాన్ని ప్రకటించిందని గుర్తు చేశారు. అదే తరహాలో మోడీ ప్రభుత్వం స్పందించాలని కోరారు.

ఉపాధి కల్పనలో మోడీ ప్రభుత్వం విఫలం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి అవకాశాల కల్పనలో విఫలమైందని విజయరాఘవన్ విమర్శించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, వాటిని కేంద్రం నియంత్రించడం లేదని చెప్పారు. మార్కెట్‌పై ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదన్నారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పిస్తున్నదని, పేదలపై భారాలను మోపుతున్నదని విమర్శించారు. జిఎస్‌టి విధానం పేదలకు అనుకూలంగా లేదన్నారు. పేదలు వినియోగించే వస్తువులపై జిఎస్‌టిని విధిస్తూ కార్పొరేట్ పన్నును మాత్రం కేంద్రం తగ్గించిందని గుర్తు చేశారు. లేబర్‌కోడ్‌లను అమలు చేయాలని చూస్తున్నదని చెప్పారు. కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని అన్నారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఈనెల తొమ్మిదిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మికులు, రైతులు, కూలీల నుంచి పెద్దఎత్తున స్పందన వచ్చిందన్నారు.

మైనార్టీలపై దాడి చేస్తున్న బిజెపి

దేశంలో మానవ హక్కులపై దాడి జరుగుతోందని విజయరాఘవన్ చెప్పారు. మైనార్టీలపై బిజెపి దాడి చేస్తోందని అన్నారు. కేంద్ర మంత్రులు కొందరు మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. అస్సాం, బెంగాల్‌లో మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని వివరించారు. మావోయిస్టుల రాజకీయ విధానానికి తాము మద్దతు ఇవ్వడం లేదన్నారు. కానీ మావోయిస్టులను అంతమొందిస్తామని కేంద్రం ప్రకటించడం మానవ హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని చెప్పారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లు ఆ ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు కృషి చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ వ్యవహారాల్లో వారు జోక్యం చేసుకుంటున్నారని, రాజ్‌భవన్‌లు ప్రత్యామ్నాయ సచివాలయాలుగా మారుతున్నాయని చెప్పారు. కేరళలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని వివరించారు. 12 విశ్వవిద్యాలయాలు ఉంటే 11 వర్సిటీలకు విసిలు లేరని ఆందోళన వ్యక్తం చేశారు. విసిలను గవర్నర్ ఆమోదించడం లేదన్నారు. వర్సిటీలకు ఛాన్సలర్‌గా ఉన్న గవర్నర్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. బీహార్‌లో ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని విమర్శించారు. ఆధార్, రేషన్‌కార్డులను ఇసి పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని బిజెపి చూస్తోందని విమర్శించారు. ప్రజల హక్కులను కాపాడేందుకు పోరాటాలు చేస్తామన్నారు. ఇండియా-పాకిస్తాన్ యుద్ధ సమయంలో ఇబ్బందులకు గురైన ప్రజలకు అండగా ఉండాలని చెప్పారు. బాధితులకు కేంద్రం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం ఆధ్వర్యంలో స్వతంత్రంగా ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. రాష్ట్రంలోనూ ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర కమిటీలో చర్చించి కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

అమెరికా ఒత్తిళ్లకు లొంగితే తెలంగాణకు అన్యాయం : రాఘవులు

అమెరికా ఒత్తిడికి మోడీ ప్రభుత్వం లొంగితే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు చెప్పారు. అమెరికాతో వ్యాపార ఒప్పందం కోసం భారత్ చర్చలు జరుపుతోందని అన్నారు. తక్కువ సుంకాలతో దిగుమతి చేసుకోవాలంటూ అమెరికా ఒత్తిడి చేస్తోందని వివరించారు. కార్ల దిగుమతికి అంగీకరిస్తే ఏపిలో కియా కార్ల ఉత్పత్తి జరుగుతోందని, దానిపై ప్రభావం పడుతుందని చెప్పారు. ఫార్మా పరిశ్రమలను అమెరికా నియంత్రించేలా కేంద్రంపై ఒత్తిడి చేస్తోందని వివరించారు. దాంతో భారత్‌లో ఫార్మారంగం దెబ్బతింటుందన్నారు. రాష్ట్ర సమస్యలపై ఢిల్లీకి వెళ్లి కేంద్రప్రభుత్వ పెద్దలను కలుస్తున్న రేవంత్‌రెడ్డి అమెరికా ఒత్తిడికి సంబంధించిన అంశాలను కూడా లేవనెత్తాలని కోరారు. బీహార్‌లో రాహుల్‌గాంధీ, ఎంఎ బేబీ నిరసనలో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఇది పౌరసత్వానికి సంబంధించింది కాదనీ, ఓటర్ కోసం ఆధార్‌ను అంగీకరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌లో అన్ని డాక్యుమెంట్లనూ అంగీకరిస్తామంటూ తెలంగాణ ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. ఇలా ఒత్తిడి పెంచితే న్యాయవ్యవస్థ కూడా ఓ నిర్ణయం తీసుకుంటుందని సూచించారు. పనిగంటలను పెంచేందుకు బిజెపి ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఈ సమయంలో రేవంత్ ప్రభుత్వం పనిగంటలను ఎనిమిది నుంచి పదికి పెంచుతూ 282 జీవోను తెచ్చిందన్నారు. ఇది దురదృష్టకరమనీ, పనిగంటల పెంపు కార్మికులకు న్యాయం కాదని చెప్పారు. బిజెపి విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఖండించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు అడ్డం కావొద్దని కోరారు. మోడీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని అన్నారు. అమెరికా 249వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారని గుర్తు చేశారు. అమెరికాను ప్రశంసించడమే కాకుండా ప్రజలకు కలిగే హాని గురించి చెప్పాలన్నారు.

బిసిల రిజర్వేషన్లపై మేధావుల సమావేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని నిర్ణయించిన నేపథ్యంలో బిసి కమిషన్ చైర్మన్ శనివారం హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో మేధావులతో సమావేశమయ్యారు. రిజర్వేషన్లు అమలు కావడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ఎదురయ్యే అవాంతరాలు, అందుకు అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించాల్సిన తీరుపై చర్చించారు.

నీటి ప్రాజెక్టుల కోసం భూసేకరణను వేగవంతం చేయండి

- పునరావాస పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతోపాటు నిర్వాసితుల పునరావాస పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్లతో నీటిపారుదల అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని చట్టపరమైన, పాలనాపరమైన అంశాలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. భూసేకరణ, పునరావాస పనుల్లో జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాల వారీగా ప్రాజెక్టుల పురోగతిలో ఎదురౌతున్న ఆటంకాలను అధిగమించేందుకు అధికార యంత్రాంగం పని చేయాలన్నారు. భూసేకరణలో జరుగుతున్న జాప్యంతో సర్కారుపై వ్యయభారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. భూములు కోల్పోతున్న రైతులతో అధికారులు సానుకూలంగా చర్చలు జరపాలన్నారు. నష్టపరిహారం, పునరావాసం వంటి అంశాలపై బాధితులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విషయంలో ఆలస్యం చేస్తే ప్రభుత్వం ప్రజావ్యతిరేకతతోపాటు న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తోందని అధికారులను హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్మాణాలపై ఆయా ఏజెన్సీలతో నిరంతరం సంప్రదింపులు జరపాలన్నారు. అదే సమయంలో పాలనాపరమైన అంశాలలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చూడాలని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. టన్నెల్ నిర్మాణాల్లో అవసరమైన ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు భారత సైన్యంలో పని చేసిన ప్రముఖ ఇంజనీరింగ్ నిపుణులైన హర్పాల్ సింగ్, కల్నల్ పరిక్షిత్ మెహ్రాల సేవలను ఉపయోగించుకోబోతున్నట్టు తెలిపారు. ఆ ఇద్దరు అత్యంత క్లిష్టమైన రోహ్టాంగ్, జోజిలా టన్నెల్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. రాజేంద్రనగర్‌లోని వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను మరింత బలోపేతం చేసేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలని మంత్రి సూచించారు.

పాలిసెట్ సీట్లను తక్షణమే కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా సీట్లను తక్షణమే కేటాయించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజినీకాంత్, కార్యదర్శి టి నాగరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాలిసెట్‌కు 22 వేల మంది విద్యార్థులు రాశారని తెలిపారు. ఈ నెల నాలుగో తేదీన పాలిసెట్ మొదటి విడత సీట్ల కేటాయింపు ఉన్నా ఇంకా కేటాయించలేదని పేర్కొన్నారు. దానిపై అధికారులు నోరుమెదపడం లేదని తెలిపారు. అనేక కారణాలను చెప్తూ వాయిదా వేశారని పేర్కొన్నారు. విద్యార్థుల డాటా ఎరేజ్ అయ్యిందనే వార్తలు వస్తున్నాయని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో ప్రవేశాలను కల్పించడంలో సాంకేతిక విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌ను ఎందుకు వాయిదా పడిందో విద్యార్థులకు సమాచారం ఇవ్వడం లేదని తెలిపారు. సాంకేతిక సమస్య వల్ల వెబ్‌ఆప్షన్లు ఇవ్వడం సాధ్యం కావడం లేదంటూ విద్యార్థులు చెప్తున్నారని పేర్కొన్నారు. ఫీజులు నిర్ణయించలేదనీ, అందుకే కౌన్సెలింగ్ ఆలస్యమవుతున్నదంటూ అధికారులు చెప్తున్నారని వివరించారు.

అసమానతలు లేని సమాజమే అంబేద్కర్ లక్ష్యం

- రాజ్యాంగ రచనలోనూ దాన్ని ప్రతిబింబించారు
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసమానతలు లేని సమాజమే లక్ష్యంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చివరి వరకు పోరాడారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఠాగూర్ ఆడిటోరియంలో శనివారం "దీ కానిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియా.... దీ కంట్రిబ్యూషన్ ఆఫ్ బిఆర్ అంబేద్కర్" అనే అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు నుంచి దాని అమలు వరకు సుదీర్ఘంగా సాగిన ప్రక్రియలో అంబేద్కర్ క్రియాశీల పాత్ర పోషించారని గుర్తు చేశారు. రాజ్యాంగ రక్షణ కవచంలా ఆర్టికల్ 32 పౌరహక్కులకు భంగం కలగకుండా కాపాడుతోందన్నారు. పరిష్కార మార్గాలులేని హక్కులున్నా ఉపయోగంలేదని అంబేద్కర్ చెప్పేవారని అన్నారు. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లితే నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే వేసులుబాటును రాజ్యాంగం కల్పించిందని జస్టిస్ గవాయ్ వివరించారు. అమెరికాలో ద్వంద పౌరసత్వం అమల్లో ఉన్నప్పటికీ.... ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంతో పాటు సమాఖ్య పౌరసత్వం ఉందని అన్నారు. అందుకు భిన్నంగా రాష్ట్రాలన్నింటిని ఏకతాటిపైకి తెచ్చేలా బలమైన ప్రజాస్వామ్య దేశంగా పటిష్టపరిచేలా.. ఒకే దేశం ఒకే రాజ్యాంగాన్ని అంబేద్కర్ అమల్లోకి తీసుకురావడం గర్వించాల్సిన విషయమని అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింహ మాట్లాడుతూ అంబేద్కర్‌కు హైదరాబాద్‌కు విడదీయలేని అనుబంధం ఉందని చెప్పారు. హైదరాబాద్ స్టేట్ చీఫ్ జస్టిస్ పదవి చేపట్టాల్సిందిగా నాటి నిజాం అభ్యర్థనను అంబేద్కర్ తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇక్కడ జరిగిన అనేక సామాజిక ఉద్యమాలకు మద్దతు ప్రకటించారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, అడ్వకేట్ జనరల్ ఎ సుదర్శన్ రెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఒఎస్‌డి జితెందర్‌కుమార్ నాయక్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కెఎల్‌హెచ్ క్యాంపస్‌ల సామాజిక సేవలకు గుర్తింపు

హైదరాబాద్ : కెఎల్‌హెచ్ హైదరాబాద్‌కు చెందిన బాచుపల్లి, అజీజ్‌నగర్ క్యాంపస్‌లు పివి నరసింహారావు ట్రస్ట్ నుంచి సామాజిక బాధ్యత కార్యక్రమాలకు గుర్తింపు లభించిందని కెఎల్‌హెచ్ ఓ ప్రకటనలో తెలిపింది. బాచుపల్లి క్యాంపస్ ఒకే రక్తదాన శిబిరంలో 245 యూనిట్ల రక్తం సేకరించి అగ్రగామిగా నిలువగా, అజీజ్‌నగర్ క్యాంపస్ 200 యూనిట్లను సేకరించిందని కెఎల్ఇఎఫ్ డీమ్డ్ టుబి యూనివర్శిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ హవిష్ తెలిపారు. కెఎల్‌హెచ్ బాచుపల్లి తరపున కంప్యూటర్ సైన్స్ విభాగం నుండి జి లావణ్య, కెఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్ నుండి ఎంపి మల్లేష్ అవార్డులు అందుకున్నారని వెల్లడించారు.

అమెజాన్ ఫైర్ టివి స్టిక్‌తో టివి అప్‌గ్రేడ్

హైదరాబాద్ : స్మార్ట్ టివి నెమ్మదిగా నావిగేషన్, ఆలస్యం అనుభవంతో ఇబ్బంది పడుతుంటే అమెజాన్ ఫైర్ టివి స్టిక్‌తో స్ట్రీమింగ్, చిత్ర నాణ్యతను పెంచుకోవచ్చని ఆ సంస్థ తెలిపింది. దీంతో కొత్త టివి అనుభవాన్ని పొందవచ్చని పేర్కొంది. ఇందులో నాలుగు వేరియంట్లు అందుబాటులో ఉన్నాయని.. అమెజాన్ ప్రైమ్ సేల్‌లో వీటిపై 58 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తున్నట్లు అమెజాన్ తెలిపింది. ఇది అలెక్సా వాయిస్ అనుకూలా స్మార్ట్ ఉపకరణమని పేర్కొంది. అమెజాన్ యాప్ స్టోర్ ద్వారా 12వేల పైగా యాప్‌లలో వేలాది సినిమాలు, టివి షోలకు యాక్సెస్ లభిస్తుందని పేర్కొంది.

పేదల ఇళ్లు కూల్చడం దుర్మార్గం

- జిఓ 49 ఉపసంహరించుకోవాలి
- కల్తీకల్లును అరికట్టాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కల్తీ కల్లు ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. డ్రగ్స్‌ను అణచివేస్తామని చెప్తున్న ప్రభుత్వం కల్తీ కల్లును అరికట్టాలని కోరారు. ఏడుగురు మరణించారని, ఆ కుటుంబాలను ఆదుకోవాలని చెప్పారు. బసవతారకం నగర్‌లో పేదల ఇండ్లను కూల్చడం దుర్మార్గమని విమర్శించారు. 40 ఏళ్ల నుంచి ప్రజలు అక్కడ నివాసముంటున్నారని గుర్తు చేశారు. అధికారంలోకి రాకముందు బసవతారకం నగర్‌లో ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ ఇండ్లు కూల్చడం ఏంటని ప్రశ్నించారు. ప్రజావ్యతిరేక విధానాలను ప్రభుత్వం మానుకోవాలని కోరారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని చెప్పారు. ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 49 జిఓ పేరుతో ఏడు లక్షల ఎకరాలను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. ఆ జిఓను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.ఎనిమిది వేల కోట్లు బకాయిలున్నాయని వివరించారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు చదివే బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు రూ.154 కోట్ల బకాయిలున్నాయని, వాటిని విడుదల చేయాలని కోరారు. ఈ నెల 14 నుంచి కొత్త రేషన్‌కార్డులను ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. చిన్న కారణాలతో దరఖాస్తులను తిరస్కరించారని అన్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ఆందోళనా పోరాటాలను చేపడతామన్నారు. విలేకర్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్లను అమలు చేయాలని చెప్పారు. ఆర్డినెన్స్ తెచ్చిన బిసిల రిజర్వేషన్లను అమలు చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. బిసిల పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. బలం ఉన్న చోట ఒంటరిగా పోటీ చేస్తామని చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక మిగతా విషయాలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. నవంబర్ ఒకటి నాటికి కేరళలో పేదరికాన్ని నిర్మూలించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని విజయరాఘవన్ చెప్పారు. అందుకోసం ప్రత్యేక పథకాన్ని రూపొందించిందని అన్నారు. కేంద్రం షరతులు విధిస్తే ఆ విషయాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముందుంచాలని రాఘవులు సూచించారు. అవసరమైతే అసెంబ్లీలో చర్చించాలని కోరారు. దేశంలో పేదరికం ఉందనే విషయాన్ని ప్రధాని మోడీకి గడ్కరీ చెప్పాలన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు రెండు నాల్కలుంటాయని చెప్పారు. ఒకరు అనుకూలంగా, మరొకరు వ్యతిరేకంగా మాట్లాడి ప్రజలను మోసం చేస్తారని అన్నారు. అందులో మోడీ, గడ్కరీ ఉన్నారని వివరించారు. స్థానిక సమస్యలు, ప్రభుత్వ హామీల అమలు కోసం ఉద్యమాలను నిర్మిస్తామని జాన్‌వెస్లీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు చేస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

- ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌లో వాహన సామర్థ్యం నిర్ధారణ
- వాహన సారథిలో తెలంగాణ భాగస్వామ్యం : మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలు చేస్తే అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసేలా భవిష్యత్‌లో చర్యలు చేపట్టనున్నామని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వాహనాల వెనుక వైపు రిఫ్లెక్టర్ రేడియం స్టిక్కర్లను తప్పనిసరిగా వేసుకునే విధంగా జీవో తీసుకొస్తామని, డ్రైవింగ్ శిక్షణ సెంటర్ల ఏర్పాటు ఆలోచన చేస్తున్నామని తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని దండంపల్లి వద్ద రూ.ఎనిమిది కోట్లతో నిర్మించనున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శనివారం రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి పొన్నం శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నిర్లక్ష్యంగా వాహనం నడపడం, వాహనం ఫిట్నెస్ లేకపోవడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని తగ్గించేందుకు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఉపయోగపడుతుందని చెప్పారు. మనిషికి జబ్బు చేసినప్పుడు సీటీ స్కాన్ తీసిన విధంగానే.. ఈ స్టేషన్లో సాంకేతిక పరికరాల సహాయంతో సుమారు 15 అంశాల్లో వాహనం రోడ్డుపై తిరిగేందుకు పనికొస్తుందా లేదా అన్నది నిర్ధారిస్తుందని తెలిపారు. రవాణా రంగంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా 17 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఇప్పటివరకు రవాణా శాఖ ద్వారా స్క్రాపింగ్ పాలసీని తీసుకొచ్చామన్నారు. ఎటిసి వల్ల ప్రతి వాహనం సారథి పరిధిలోకి వచ్చే విధంగా తెలంగాణను వాహన సారథిలో భాగస్వామ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

చేశామని తెలిపారు. ట్రాఫిక్ అవేర్నెస్ క్యాంపుల నిర్వహణ, పాఠశాలల్లో విద్యార్థులకు క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్‌లను ఆటోమేటిక్‌గా నిర్వహించి పాస్ అయితేనే లైసెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నార్కట్‌పల్లి డిపోకు పూర్వ వైభవం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు వల్ల 20 నెలల్లో 200 కోట్ల మంది మహిళలు ప్రయాణం చేశారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లాకు 70 ఈ బస్సులు ఇవ్వగా, 10 బస్సులు నార్కెట్‌పల్లికి, తక్కినవి ఇతర ప్రాంతాలకు తిప్పుతున్నామన్నారు. నార్కెట్‌పల్లికి 80 కొత్త బస్సులు కావాలని, ఈ డిపోకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని రవాణా శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. వాహనాల ఫిట్నెస్ సరిగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లాలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం సంతోషమని అన్నారు. జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీవాణి మాట్లాడుతూ.. మ్యాన్యువల్‌గా కాకుండా మిషన్ ద్వారా వాహనాలను పరీక్షించే అవకాశం ఏటిసి ద్వారా ఉందని తెలిపారు.

ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభం

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండ బస్ డిపోకు ఎలక్ట్రికల్ 40 బస్సులు రాగా, శనివారం 10 బస్సులకు జెండా ఊపి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రారంభించారు. ఆర్టీసీ బస్ స్టేషన్ నుంచి ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వరకు మంత్రి వెంకట్‌రెడ్డి బస్సు నడిపారు. అదేవిధంగా తిప్పర్తి, వేములపల్లి మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి, ఎస్పీ శరత్ చంద్రపవార్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, రవాణా శాఖ కమిషన్ చంద్రశేఖర్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కె.జాన్‌రెడ్డి, విశ్రాంత ఆర్టీవో మోహన్‌రెడ్డి, ఆర్టీఓ మెంబర్లు రాజిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల తాళాలు ఇచ్చేవరకు కదలం

- సిపిఎం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారులు చెప్పిన మాట ప్రకారం డబుల్ బెడ్ రూమ్స్ తాళాలు ఇవ్వాలంటూ లబ్దిదారులు ఇండ్ల వద్ద బైటాయించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హొతికెలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్స్ వద్ద శనివారం సిపిఎం ఆధ్వర్యంలో లబ్దిదారులు బైటాయించారు. ఎంతసేపైనా అధికారులు స్పందించకపోవడంతో అక్కడి నుంచి సుమారు ఆరు కిలోమీటర్లు పాదయాత్రగా వెళ్లి ఆర్‌డిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. కొద్దిసేపటి తర్వాత తహసీల్దార్ దశరథ్, ఆర్డీఓ కార్యాలయం ఏవో వంశీ, డిఎస్‌పి సైదాతో నాయకులు చర్చలు జరిపారు. తాళాలు ఇస్తే తప్ప కదిలేది లేదని తేల్చి చెప్పారు. కానీ చర్చలు విఫలం కావడంతో అక్కడే బైటాయించి నిరసన తెలిపారు. అంతకుముందు మార్గమధ్యంలో పోలీసులు అడ్డగిస్తే రోడ్డుపై బైటాయించడంతో పాదయాత్రకు అనుమతించారు. ఈ సందర్భంగా సిపిఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు ఎస్.మహిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం, అధికారులు ప్రకటించిన తేదీ ప్రకారం శనివారం ఇవ్వాల్సిన తాళాలు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పకుండా దాటవేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగచాటుగా రాత్రికి రాత్రి ప్రకటనలు ఇవ్వడం సరైనది కాదన్నారు. లబ్దిదారులు, పేదలు సొంతిండ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయినా ఇండ్ల తాళాలు ఇవ్వకుండా ఎందుకు కాలయాజన చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే లబ్దిదారులకు తాళాలు ఇవ్వాలని, లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిరుపతి, సలీముద్దీన్, బక్కన్న, లబ్దిదారులు స్వప్న, పుష్ప, నాగమ్మ, శివకుమార్, శ్రీనివాస్, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న లబ్దిదారులు

ఇన్‌స్టామార్ట్ ఆర్డర్లు రెట్టింపు

హైదరాబాద్ : వేగవంతమైన డెలివరీ సేవలను అందిస్తున్న ఇ-కామర్స్ వేదిక ఇన్‌స్టామార్ట్ 2025లో హైదరాబాద్ ఆర్డర్‌లలో 117 శాతం వృద్ధి నమోదు చేసినట్లు తెలిపింది. ముఖ్యంగా పాలు, ఎలక్ట్రానిక్స్, బొమ్మల ఆర్డర్లలో ఎక్కువ పెరుగుదల చోటు చేసుకుందని పేర్కొంది. ఒక వినియోగదారుడు సంవత్సరంలో రికార్ స్థాయిలో 617 ఆర్డర్‌లు చేశారని ఆ సంస్థ వెల్లడించింది. ఇడ్లీ, దోస పిండి, పాలు, పెరుగు, గుడ్లు, మరియు మామిడి వంటి నిత్యావసరాలతో పాటు, బ్యాటరీలు, ఛార్జింగ్ కేబుల్స్, విద్యా ఎల్‌సిడి రైటింగ్ ప్యాడ్‌లు, లిప్ బామ్‌లు, మేకప్ బ్రష్‌ల వంటి ఎలక్ట్రానిక్స్, బ్యూటీ ఉత్పత్తులు అధిక డిమాండ్‌ను నమోదు చేశాయని ఇన్‌స్టామార్ట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ హరి కుమార్ జి తెలిపారు. తమ వేదిక వినియోగదారుల అవసరాలను 11 నిమిషాల సగటు డెలివరీ సమయంతో తీరుస్తోందన్నారు.

హైదరాబాద్‌లో 17న బెంట్లీ ఇన్నోవేషన్ డే

ప్రజాశక్తి - హైదరాబాద్

బెంట్లీ సిస్టమ్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ జులై 17న హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ డే నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీలు, హైస్పీడ్ రైలు, డిజిటల్ నీటి వ్యవస్థలు, స్థిరత్వ ఇంధన నెట్‌వర్క్‌లలో భారతదేశ మౌలిక సదుపాయాలను రూపొందించే డిజిటల్ ట్విన్స్, జియోటెక్నికల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలను ప్రదర్శించనున్నట్లు పేర్కొంది. ప్రభుత్వ, పరిశ్రమ, సాంకేతిక నాయకులను ఒకచోట చేర్చి, డిజిటల్ డెలివరీ, జియోటెక్నికల్ సొల్యూషన్స్, డిజిటల్ ట్విన్స్ ద్వారా రవాణా, నీటి మౌలిక సదుపాయాల సవాళ్లను పరిష్కరించే చర్చలు జరుగుతాయని తెలిపింది.

సామ్‌సంగ్ నుంచి ఎం9 స్మార్ట్ మానిటర్ విడుదల

హైదరాబాద్ : ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ ఇండియా కొత్తగా స్మార్ట్ మానిటర్ సిరీస్‌లో ఎం9, ఎం8, ఎం7 మోడళ్లను ఆవిష్కరించింది. ఇవి 32 అంగుళాల 4కె క్యూడీ-ఒఎల్‌ఇడి డిస్‌ప్లేను కలిగి ఉంది. ఎఐ ఫీచర్లు, ధ్వని నాణ్యత, 165 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 0.03 మిల్లీసెకన్ల రెస్పాన్స్ సమయం, ఎన్‌విడియా జి-సింక్‌తో గేమింగ్ తదితర ఫీచర్లను కలిగి ఉన్నాయని ఆ కంపెనీ పేర్కొంది. ఎం8, ఎం7 మోడళ్లు ఎఐ ఆధారిత సులభ వినియోగాన్ని అందిస్తాయని పేర్కొంది. అయితే వీటి ధరలను ఆ కంపెనీ వెల్లడించలేదు.

మూసీ సమీపంలో మగ శిశువు పోలీసులు దర్యాప్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పుట్టిన నిమిషాల వ్యవధిలోనే బిడ్డను రోడ్డు పక్కన వదిలేసి వెళ్లిపోయింది ఓ తల్లి. అమ్మ వెచ్చని స్పర్శలో హాయిగా నిద్రించాల్సిన ఆ పసికూన రోడ్డు పక్కన ఏడుస్తూ కనిపించాడు. ఈ అమానవీయ ఘటన శనివారం హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. ఉప్పల్ పోలీసు స్టేషన్ పరిధి రామంతాపూర్ వివేక్‌నగర్ మూసీ సమీపంలో అప్పుడే పుట్టిన మగ శిశువు ఏడుస్తూ కనిపించడంతో స్థానికులు 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని శిశువుకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఉప్పల్ పోలీసుల సహాయంతో నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. శిశువును ఎవరు వదిలి వెళ్లారనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాబు ఆరోగ్యంగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

రెండో శనివారం సెలవు ఉపాధ్యాయుల హక్కు

- టిపిటిఎల్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు విజయ్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెండో శనివారం సెలవు పొందడం ఉపాధ్యాయుల హక్కని తెలంగాణ ప్రయివేటు టీచర్స్, లెక్చరర్ల ఫెడరేషన్ (టిపిటిఎల్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో టిపిటిఎల్‌ఎఫ్, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కొన్ని విద్యాసంస్థల్లో సెలవు ఇప్పించామని చెప్పారు. ప్రయివేటు విద్యాసంస్థలు రెండో శనివారం సెలవు ఇవ్వడం లేదన్నారు. ఇది బిక్ష కాదనీ, టీచర్ల హక్కని చెప్పారు. ఈ సెలవును విద్యాసంస్థల యాజమాన్యాలు లాక్కుంటున్నాయని అన్నారు. వారి శ్రమను అదనంగా దోచుకుంటూ మరింత దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఏమాత్రం ఖాళీ లేకుండా ఉంటున్నారని వివరించారు. బోధనతోపాటు హోంవర్క్, ప్రశ్నాపత్రాల తయారీ, జవాబు పత్రాల మూల్యాంకనం ఇలా అనేక పనులతో బిజీగా ఉంటున్నారని అన్నారు. పనిఒత్తిడితో మానసికంగా కుంగిపోతున్నారని చెప్పారు. కొన్ని విద్యాసంస్థలు రెండో శనివారం సెలవు ఇచ్చినా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం (పిటిఎం)ను నిర్వహిస్తున్నాయని వివరించారు. రెండో శనివారం సెలవు ఇవ్వకపోయినా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రెండో శనివారం సెలవు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎల్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమ్ము విజయ్‌కుమార్, పి విజయ్, డివైఎఫ్‌ఐ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ మాక్ కౌన్సెలింగ్‌లో 77,154 మందికి సీట్ల కేటాయింపు

- సీట్లు పొందని వారు 16,905 మంది
- నేటినుంచి వెబ్‌ఆప్షన్ల మార్పులకు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా మొదటి సారిగా ప్రవేశపెట్టిన మాక్ సీట్లను సాంకేతిక విద్యాశాఖ శనివారం కేటాయించింది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 95,256 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని తెలిపారు. 94,059 మంది అభ్యర్థులు 56,63,308 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. రాష్ట్రంలో 172 ఇంజినీరింగ్ కాలేజీల్లో 83,054 సీట్లు కన్వీనర్ కోటాలో ఉన్నాయని తెలిపారు. మాక్ కౌన్సెలింగ్‌లో భాగంగా 77,154 (92.89 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఇంకా 5,900 (7.11 శాతం) సీట్లు మిగిలాయని వివరించారు. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయకపోవడం, ఇతర కారణాల వల్ల 16,905 మందికి సీట్లు కేటాయించలేదని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 6,021 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఆదివారం నుంచి ఈనెల 15 వరకు వెబ్‌ఆప్షన్ల మార్పు, చేర్పులకు అవకాశం కల్పించామని వివరించారు. వాటినే ఎప్‌సెట్ మొదటి విడత వెబ్‌ఆప్షన్లుగా పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రత్యేక కేటగిరీ (ఎన్‌సీసీ/స్పోర్ట్స్) కింద ఉన్న అభ్యర్థులకు మాక్ కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించలేదని తెలిపారు. వారికి ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లోనే సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈనెల 18న ఎప్‌సెట్ తొలివిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని వివరించారు. ఇతర వివరాలు, వెబ్‌ఆప్షన్ల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

మాక్ సీట్ల కేటాయింపుతో అభ్యర్థులకు ఉపయోగం : బాలకిష్టారెడ్డి

ఎప్‌సెట్ మాక్ కౌన్సెలింగ్‌లో కేటాయించిన సీట్లను అభ్యర్థులు జాగ్రత్తగా పరిశీలించాలని ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. అవసరమైతేనే వెబ్‌ఆప్షన్లలో మార్పులు చేయాలని కోరారు. విద్యార్థులకు ఉపయోగపడడం కోసమే మాక్ కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించామని తెలిపారు. అభ్యర్థులు ఇచ్చిన వెబ్‌ఆప్షన్ల ఆధారంగా వారి ర్యాంకు, రిజర్వేషన్, లింగం ఆధారంగా సీట్లు కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. మాక్ సీట్ల కేటాయింపు తర్వాత వారికి అవగాహన కలుగుతుందని వివరించారు. అభ్యర్థులు చేసిన తప్పులు, సరైన ఆప్షన్లు ఇవ్వకపోవడం, సరైన కాలేజీ, బ్రాంచీ రాలేదన్న వాటిని సరిదిద్దుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. మాక్ సీట్ల కేటాయింపు తర్వాత వెబ్‌ఆప్షన్లలో మార్పు, చేర్పులకు అవకాశముంటుందని వివరించారు.

సిపిఐ సీనియర్ నాయకులు దొడ్డ నారాయణరావు మృతి

- నివాళులర్పించిన సిపిఎం, సిపిఐ నేతలు, ప్రజాప్రతినిధులు
- జీవితాన్ని పేదలకు అంకితం చేశారు
- సిపిఐ నేత నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ సీనియర్ నాయకులు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు దొడ్డ నారాయణరావు (96) శనివారం మృతి చెందారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో దొడ్డ నారాయణరావు మృతదేహానికి సిపిఐ, సిపిఎం నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పూలమాలలేసి నివాళులర్పించారు. పేద బడుగు, బలహీన వర్గాల కోసం నారాయణరావు జీవితాంతం పోరాడారని, ఆయన జీవితాన్ని కమ్యూనిస్టు పార్టీకి అంకితం చేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జులకంటి రంగారెడ్డి అన్నారు. నారాయణరావు చిన్నతనం నుంచి కమ్యూనిస్టు పార్టీవైపు ఆకర్షితులై తన అన్న దొడ్డ నర్సయ్య అడుగుజాడల్లో నడిచారని చెప్పారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా, తెలంగాణ సాయుధ రైతాంగం పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. సుదీర్ఘకాలం సర్పంచ్‌గా, సహకార సంఘం చైర్మన్‌గా, ఎంపిపిగా, సిపిఐ ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శిగా ప్రజల కోసం విశేష సేవలందించారని వివరించారు. అలాంటి గొప్ప వ్యక్తి మృతి సిపిఐకి, గ్రామానికి తీరని లోటన్నారు.



పలువురి నివాళులు

కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి, బిఆర్‌ఎస్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపి బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, వేనేపల్లి చందర్‌రావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ అందే సత్యం, ముత్తవరపు పాండు రంగారావు, లక్ష్మీనారాయణరెడ్డి, ఎర్నేని వెంకటరత్నంబాబు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, పశ్య పద్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాములు, సిపిఎం నల్లగొండ జిల్లా మాజీ కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రామారావు, కోదాడ సిఐ రజితారెడ్డి, చిలుకూరు తహసీల్దార్ ధృవకుమార్, సిపిఎం సీనియర్ నాయకులు వేనేపల్లి వెంకటేశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సిపిఎం మండల కార్యదర్శి నాగాటి రాములు తదితరులు నారాయణరావుకు నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

జిఓ నెంబర్ 3 ను పునరుద్ధరించాలి

- జనగణన లో ఆదివాసీలకు ప్రత్యేక కాలం కేటాయించాలి
- జిఓ నెంబర్ 49 రద్దు చేయాలి
- ఎఎఆర్‌ఎం జాతీయ వైస్ చెర్మన్ మిడియం బాబూరావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జిఓ నెంబర్ 3ను పునరుద్ధరించాలని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్‌ఎం) జాతీయ వైస్ చైర్మెన్ డాక్టర్ మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. శనివారం కలకత్తాలో జరుగుతున్న ఆ సంఘం జాతీయ సమావేశాల సందర్భంగా ఆయన ఈ మేరకు డిమాండ్ చేశారు. జన గణనలో ఆదివాసీలకు ప్రత్యేక ఆదివాసి షెడ్యూల్డ్ ట్రైబ్ కాలమ్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ 49ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల నమ్మకాలు, ఆచారాలు, సంప్రదాయాల రక్షణ కోసం రాజ్యాంగంలో నిర్దిష్టమైన నిబంధనలు ఉన్నాయని గుర్తు చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు లోత రామారావు, కిల్లో సురేంద్ర , తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక విద్య ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రత్యేక విద్య ఉపాధ్యాయ సంఘం ఆవిర్భవించింది. రాష్ట్ర అధ్యక్షులుగా జంగం సుమన్, ప్రధాన కార్యదర్శిగా జి శివరాజ్, కోశాధికారిగా మారుపాక భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఎం కపిల్‌రెడ్డి, శ్రీకాంతాచారి, రహీం, ఉపాధ్యక్షులుగా సిలివేరి వెంకటేశం, జ్యోతి, జాయింట్ సెక్రెటరీలుగా మార్పాటి శ్రీధర్‌రెడ్డి, వల్లెపు వీరన్న, షోయబ్‌తోపాటు టెక్నికల్ అడ్వైజర్, మహిళా కార్యదర్శులు, పిఆర్‌ఒలు, వికలాంగుల విభాగం కార్యదర్శులను ఎన్నుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పుల్గం దామోదర్‌రెడ్డి, అసోసియేట్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్గొండ హాలియాలో పిఎన్‌బి కొత్త శాఖ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

దిగ్గజ ప్రభుత్వ రంగ విత్త సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) హైదరాబాద్ సర్కిల్ ఆఫీస్ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లాలోని హాలియాలో కొత్త శాఖను ఏర్పాటు చేసింది. దీనిని ఆ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. పరమశివం లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోనల్ హెడ్ సునీల్ కుమార్ చుగ్, సర్కిల్ హెడ్ అరవింద్ కల్రా పాల్గొన్నారు. ఇది హైదరాబాద్ సర్కిల్‌లో 73వ బ్రాంచ్, జోన్‌లో 435వ శాఖ అని పిఎన్‌బి వెల్లడించింది. ఈ సందర్భంగా హాలియాలో వ్యవసాయ రుణాల జారీ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా 25 వ్యవసాయ రుణ ఆమోద చెక్కులు, స్వయం సహాయక బందాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, ఇతర పథకాల కింద దాదాపు రూ.60 కోట్ల విలువ చేసే మొత్తం పంపిణీ చేశారు. 200 మందికి పైగా వ్యవసాయ రైతులు హాజరయ్యారు. ఉచిత వైద్య శిబిరాన్ని కూడా నిర్వహించారు. ఇది వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధికి తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందని పిఎన్‌బి పేర్కొంది.

హామీలను తుంగలో తొక్కిన సిఎం

- సన్న బియ్యంలో సగం నూకలే..
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల సమయంలో హామీలను గుప్పించి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. వాటిని అమలు పరచకుండా తుంగలో తొక్కారని తెలంగాణ జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంలో శనివారం ఆమె పర్యటించారు. వేములనర్వ గ్రామంలో జాగృతి కార్యాలయాన్ని ప్రారంభించారు. మహాలక్ష్మి పథకం అమలు చేయాలంటూ కాకునూరులో చీమల రమేష్ కురుమ ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టుకార్డుల నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతినెలా రూ.2500 ఇస్తానని చెప్పి సిఎం మోసం చేశారని ఆరోపించారు. మూడు నెలల నుంచి పింఛన్లు రాక లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి మాజీ సిఎం కెసిఆర్‌ను తిడుతూ తన పబ్బం గడుపుకుంటున్నారే తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. సన్నం బియ్యంలో సగం నూకలే ఉన్నాయని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సుల ప్రయాణమంటూ మగవారికి టికెట్ల ధరలు పెంచి మోసం చేశారన్నారు. గుడిసెలను కూల్చడానికి బుల్డోజర్లు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని, లేనియెడల మహిళలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గండ్ర లక్ష్మమ్మ, సింగిల్ విండో చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపిపి వాడ్యాల అనురాధ పర్వతరెడ్డి, మాజీ ఎంపిటిసిలు రమాదేవి కోటీశ్వర్, పల్లె రాములు, మాజీ ఉప సర్పంచ్ సింగిడి జంగారెడ్డి, బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం హత్య

- అత్తను అద్దె వాహనంతో ఢీకొట్టించిన అల్లుడు
- పోలీసుల దర్యాప్తులో అసలు విషయం వెలుగులోకి..
- వివరాలు వెల్లడించిన సిపి బి అనురాధ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన అప్పులు తీర్చుకునేందుకు ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ఓ వ్యక్తి తన అత్తమ్మనే హత్య చేయించాడు. ఆపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆమె మృతిచెందినట్టు కట్టు కథ అల్లాడు. అయితే, పోలీసుల విచారణలో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నెల ఏడున జరిగిన మహిళ హత్య కేసుకు సంబంధించిన వివరాలను సిద్దిపేటలో శనివారం విలేకర్ల సమావేశంలో సిపి డాక్టర్ అనురాధ వెల్లడించారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని పెద్దమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన తాళ్ల వెంకటేష్ తన స్నేహితుడైన కరుణాకర్‌కు రూ.లక్ష 30 వేలు అప్పుగా ఇచ్చాడు. అలాగే పౌల్ట్రీఫామ్, వ్యవసాయంలో మొత్తంగా రూ.22 లక్షల వరకు నష్టపోయాడు. సిద్దిపేట పట్టణానికి చెందిన తన అత్తమ్మ తాటికొండ రామవ్వ (50)కు గత మార్చిలో పోస్ట్ ఆఫీస్‌లో రూ.755 చెల్లించి రూ.15 లక్షల ఇన్సూరెన్స్, ఎస్‌బిఐ బ్యాంకులో ఏడాదికి రూ. రెండు వేలు చెల్లించి రూ.40 లక్షల యాక్సిడెంట్ పాలసీ ఇన్సూరెన్స్ చేయించాడు. కాగా, తన అప్పులు తీరాలంటే అత్తమ్మను ఎలాగైనా హత్య చేయాలని, ఆ తర్వాత ఇన్సూరెన్స్ డబ్బులు వస్తాయని పథకం వేశాడు. తన స్నేహితుడు కరుణాకర్ దగ్గరికి వెళ్లి విషయం చెప్పాడు. ఆమెను హత్య చేస్తే తాను అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని, పైగా ఇన్సూరెన్స్ ద్వారా వచ్చిన డబ్బులను సమానంగా పంచుకుందామని చెప్పాడు. దానికి అతడు ఒప్పుకున్నాడు. ఈ నెల 7న ఉదయం 9.30 సమయంలో కరుణాకర్‌కు వెంకటేశ్ వాట్సప్ కాల్ చేసి.. తన అత్తమ్మను పెద్దమాసన్‌పల్లికి తీసుకొస్తానని, ఓ వాహనం తీసుకొని తుక్కాపూర్‌కు రమ్మని చెప్పాడు. ఆ కారు నెంబర్ ప్లేట్‌పై టీఆర్ స్టిక్కర్‌ను అతికించి తుక్కాపూర్‌కు వెళ్లాడు. తాను వచ్చిన విషయాన్ని వాట్సప్ కాల్ ద్వారా వెంకటేశ్‌కు చెప్పాడు. అత్తమ్మను తన వ్యవసాయ భూమి వద్ద రోడ్డుపై కూర్చోబెట్టి.. తాను పొలంలోకి వెళ్లినట్టు వెంకటేష్ తెలిపాడు. కారుతో ఆమెను ఢీకొట్టి హత్య చేయాలని కరుణాకర్‌కు సూచించాడు. దాంతో అతడు ఆమెను కార్‌తో ఢీకొట్టి హత్య చేశాడు. ఆ తర్వాత పని పూర్తి అయినట్టు వెంకటేష్‌కు వాట్సప్ కాల్ ద్వారా చెప్పాడు. నెంబర్ ప్లేటుపై గల స్టిక్కర్‌ను తొలగించి సిద్దిపేటలో ఓన్ డ్రైవింగ్ వారికి కారును అప్పగించాడు. అనంతరం గుర్తు తెలియని వాహనం ఢీకొని తన అత్తమ్మ చనిపోయినట్టు వెంకటేష్ తొగుట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ రవికాంత్‌రావు, సిబ్బందితో రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సిసి కెమెరాలు, టెక్నాలజీ ఉపయోగించి విచారణ చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కీలకమైన కేసును గజ్వేల్ ఎసిపి నరసింహులు ఆధ్వర్యంలో త్వరగా ఛేదించిన తొగుట సిఐ లతీఫ్, ఎస్‌ఐ రవికాంత్‌రావు, సిబ్బందిని సిపి అభినందించి రివార్డ్ ఇచ్చారు.

బెస్ట్‌అవైలబుల్ స్కీమ్ బకాయిలను విడుదల చేయాలి

- సిఎం రేవంత్‌రెడ్డికి గిరిజన సంఘాల లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలనీ, అంబేద్కర్ విద్యా నిధి పథకంద్వారా విదేశీ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల లిస్టుకు ఆమోదించాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ అంజయ్య నాయక్ సిఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. గిరిజన గురుకులాల అడ్మిషన్లు గందరగోళంగా జరిగాయనీ, దీనికి ఆ సంస్థ అధికారే కారణమని వారు తెలిపారు. మెరిట్ ఆధారంగా మూడు దఫాలుగా సీట్లను భర్తీ చేశామని సంస్థ కార్యదర్శి అలగు వర్షిణి ప్రకటించారనీ, అయితే రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశ పరీక్ష రాసినా సీటు దక్కని వారు, వచ్చినా కొన్ని కారణాలతో చేరని వారున్నారని వివరించారు. వసతులు సరిగాలేవనే కారణాలతో వేలాది సీట్లు భర్తీ కాకుండా బ్యాక్ లాగ్ ఏర్పడ్డాయని తెలిపారు. మిగిలిపోయిన సీట్లను ఆనవాయితీ ప్రకారం ప్రతిఏటా సోషల్ వెల్ఫేర్ గురుకులాలు, గిరిజన గురుకుల విద్యాసంస్థలు విడివిడిగా రాష్ట్ర కార్యాలయాలకు పంపి, సీరియల్ ప్రకారం వచ్చిన మ్యానువల్ దరఖాస్తుల ఆధారంగా సీట్లు భర్తీ చేసే వారని పేర్కొన్నారు. దీంతో పరీక్ష రాసినా సీటు రాని వారందరినీ మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసుకునే అవకాశం ఉండేదని గుర్తు చేశారు.

విద్యలో అంతరాలపై విస్తృత చర్చ అవసరం

- అసమానతలు లేని విద్యే భవిష్యత్‌కు దారి చూపుతుంది
- పౌర స్పందన వేదిక రౌండ్ టేబుల్‌లో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యలో అంతరాలు ఉండకూడదనీ, అసమానతలు లేని విద్యే సమాజ భవిష్యత్‌కు దారి చూపుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ పౌరస్పందన వేదిక ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "విద్యలో అంతరాలు సమసిపోయేదెట్లా?" అనే అంశంపై వేదిక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ 1991 తర్వాత విద్యారంగంలో అనేక మార్పులు వచ్చాయని చెప్పారు. ముఖ్యంగా ప్రయివేటు పాఠశాలల్లోనూ తీవ్ర అంతరాలు ఏర్పడ్డాయని చెప్పారు. ఆర్థిక స్థోమత ఆధారంగానే చదువు దొరుకుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు దిక్కులేనోళ్లకేనా? అనే చర్చ సాగాలన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం, పౌరసమాజం స్పందించాల్సినంతగా స్పందించటం లేదని చెప్పారు. ఈ పరిస్థితి ఇట్లనే కొనసాగితే..రాబోయే కాలంలో సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. విద్యలో ఏర్పడిన అసమానతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశమివ్వకూడదని సూచించారు. సామాజికంగా వెనుకబడిన వారే ఆర్థికంగా కూడా వెనుకబడి ఉన్నారనేది ఒక సత్యమని చెప్పారు. కారణంగానే ప్రభుత్వ పాఠశాలల్లోనూ, తక్కువ ఫీజులు తీసుకుంటున్న ప్రయివేటు పాఠశాలల్లోనూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి పిల్లలు 95 శాతానికి పైగా చదువుతున్నారని వివరించారు. చదువుల్లో ఉన్న అంతరాలు బాల, బాలికల మనుస్సుల్లో హెచ్చుతగ్గులు కల్గిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రిటైర్డ్ డిఇఒ నారాయణ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో విద్య అతి ముఖ్యమైన అంశమన్నారు. సమాజంలో ఎన్నో సమస్యలున్నా..వాటికంటే ఇదే కీలకమైందని చెప్పారు.అయితే దీనిలో అసమానతలు తొలగించాలని సూచించారు. పాఠశాల అంటేనే భవిష్యత్ అని వ్యాఖ్యానించారు. అసమానతలు లేని, నాణ్యమైన విద్యను ప్రభుత్వాలు అందించటం ఒక ప్రాథమిక హక్కని తెలిపారు.పాఠశాల స్థాయిలో కామన్ విద్యా విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎంవి ఫౌండేషన్ అధ్యక్షులు వెంకటరెడ్డి మాట్లాడుతూ అసమానతల విద్యను రాజకీయ సమస్యగా చూసినప్పుడే పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ప్రయివేట్ విద్యకు అనుమతులిస్తున్న క్రమంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయటం ఎలా సాధ్యమవుతుందో చెప్పాలని నిలదీశారు.

డిబిఎఫ్ జాతీయ అధ్యక్షులు శంకర్ మాట్లాడుతూ దిక్కులేని పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని చెప్పారు. ప్రస్తుతం ప్రయివేటు పాఠశాలల్లో అతి తక్కువ మంది ఉన్నారని వివరించారు. ప్రయివేటు రంగంలో 36లక్షల మంది ఉంటే..అందులో 37వేల మంది మాత్రమే దళిత, గిరిజన విద్యార్థులని చెప్పారు. బెస్ట్ అవైల్‌బుల్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు సంబంధించిన బకాయిలను నేటికీ ప్రభుత్వం చెల్లించకపోవటం మూలంగా వారి సర్టిఫికేట్స్ ఆయా పాఠశాలల్లోనే ఉండిపోయాయని చెప్పారు. ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా పెండింగ్‌లోనే ఉందన్నారు.

ఇదంతా ప్రభుత్వం సృష్టించే అసమానత కాకపోతే మరేంటని? ప్రశ్నించారు. తెలంగాణ పౌరస్పందన వేదిక ప్రధాన కార్యదర్శి ఎం రాధేశ్యాం మాట్లాడుతూ విద్యలో ప్రయివేట్ రంగం పట్టు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేట్‌లోనూ అసమానతలు పెరిగాయని చెప్పారు. వ్యాపారీకరణలో విద్యకూడా ఒక భాగమైపోయిందని అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యలో నాణ్యత ఉండదని నమ్మించే ప్రయత్నం జరుగుతున్నదని చెప్పారు. కార్యక్రమంలో పట్నం నాయకులు కెవిఎస్ఎన్ రాజు,పేరెంట్ కమిటీ అధ్యక్షులు మహబూబ్‌అలీ, నాగార్జున సురేంద్రబాబు, సాయిబాబు, తదితరులు మాట్లాడారు.